వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం
హైదరాబాద్
గురువారం 2 ఏప్రిల్ 2026



## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

## ముమ్మరంగా సాగుతున్న కార్యక్రమం

ముదిగొండ మండలం ఏప్రిల్ 1 వాయిస్ టుడే : ముదిగొండ మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ముమ్మరంగా నిర్వహించబడింది. న్యూ లక్ష్మీపురం, ఖానాపురం, పెద్ద మండవ గ్రామాల్లో సర్పంచులు సలీమా ఖాసీం బాబు, లంకెల కోటిరెడ్డి మరియు ఉపసర్పంచ్ మాలోజీ కవిత చేతుల మీదుగా ప్రారంభమైన ఈ శిబిరాల్లో పశువైద్యాధికారి డాక్టర్ పి. అశోక్ పర్యవేక్షణలో సిబ్బంది టీకాలు వేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, పశువులను ప్రమాదకర వ్యాధుల నుండి కాపాడుకోవడానికి రైతులందరూ విధిగా టీకాలు వేయించుకోవాలని, పశువైద్య సిబ్బందికి సహకరిస్తూ పశువుల ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని పశువులకు టీకాలు వేయించుకున్నారు.

## ఏసీబీ దాడుల్లో
## రూ.కోట్ల బకాయిలు బహిర్గతం

సత్తుపల్లి: సత్తుపల్లి పురపాలిక కార్యాలయంలో ఆర్థిక అవకతవకలపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఇంటిపన్ను రివిజన్‌కు సంబంధించి పురపాలిక కాంట్రాక్టు బిల్ కలెక్టర్ రూ.2లక్షల లంచం డిమాండ్ చేశాడు. సదరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రూ.1.50 లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని నగదు ఇచ్చారు. ఈ అంశంపై బాధితుడు ఆశ్రయించటంతో ఖమ్మం ఏసీబీ డీఎస్పీ వై.రమేశ్ తన సిబ్బందితో సత్తుపల్లి పురపాలిక కార్యాలయంలో దాడులు చేసినట్లు తెలుస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారీమొత్తంలో పన్ను బకాయిలు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. సుమారు రూ.22.23కోట్లకు రూ.7.99కోట్లు మాత్రమే వసూలయ్యాయని తెలిపారు. బకాయిల వివరాలను నమోదు చేసుకున్నారు. ఎల్ఆర్ఎస్ కింద రూ.16.44కోట్లు వసూలు చేయాల్సి ఉండగా రూ.13.08కోట్ల బకాయిలు పేరుకుపోయాయని గుర్తించారు. ఆస్తిపన్నులో రూ.5.12కోట్లకు రూ.1.02కోట్లు, షాపింగ్ కాంప్లెక్స్ పన్నులో రూ.62లక్షలకు రూ.8.72లక్షల బకాయిలు ఉన్నట్లు ప్రకటించారు. ప్రకటన పన్నులు రూ.3.80లక్షలు పూర్తిగా వసూలుకాలేదని స్పష్టం చేశారు.

బిల్ కలెక్టర్ నాగుబండి నరసింహారావు, మేనేజర్ ఎం.శ్రీనివాస్ తదితరుల మధ్య అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. రికార్డుల నిర్వహణలో లోపాలు ఉన్నట్లు ప్రకటించారు. సమగ్ర విచారణ చేపట్టాల్సి ఉందన్నారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో
## యువకుల దుర్మరణం

నెహ్రూసెంటర్: ఒక్కగానొక్క కొడుకు.. ఇంజినీరింగ్ పూర్తిచేసి ఉద్యోగంలో చేరాడు.. తనయుడిని చూస్తూ ఆ తల్లిదండ్రులు ఆనందంగా ఉంటున్నారు.. అంతలోనే రోడ్డు ప్రమాద రూపంలో కుమారుడిని మృత్యువు కబళించింది.. ఈ విషాద ఘటన మహబూబాబాద్ శివారులో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు, మహబూబాబాద్ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం ఒడ్డుగూడెం గ్రామ పరిధిలోని స్నేహనగర్‌కు చెందిన బానోతు శ్రీను-వినోద దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొడుకు బానోతు మహేందర్(23) ఇంజినీరింగ్ అభ్యసించి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. మంగళవారం రాత్రి రైలులో హైదరాబాద్ వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై మహబూబాబాద్‌కు వస్తున్నారు. ఈక్రమంలో ఆర్తీ గార్డెన్ సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈప్రమాదంలో తలకు తీవ్రగాయాలవటంతో మహేందర్ అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు అంబులెన్స్‌లో మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. మహేందర్ తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై సూరయ్య కేసు నమోదు చేశారు.

### లారీ టైర్ పంక్చర్ వేయిద్దామని వెళ్తుండగా..

దమ్మపేట: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలోని గున్నేపల్లి శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగాం జిల్లా తరిగొప్పుల గ్రామానికి చెందిన చిలువేరు రమేశ్ (32) సింధూ పార్సిల్ సర్వీసులో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి జంగారెడ్డిగూడేనికి పార్సిల్ లారీతో వస్తుండగా, మార్గంమధ్యలోని గున్నేపల్లి శివారులో లారీ టైరు పేలింది. లారీని నిలుపుదల చేసిన రమేశ్ పంక్చర్ దుకాణం వద్దకు వెళ్లేందుకు రోడ్డుపై నడుస్తుండగా.. సత్తుపల్లి వైపు నుంచి అతివేగంగా వచ్చిన ఓ ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంపై ఉన్న మొద్దులగూడేనికి చెందిన బూరుగు వంశీ, నారం నాగరాజులకు బలమైన గాయాలయ్యాయి. వీరిని స్థానికులు 108 వాహనంలో సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రమేశ్‌ను మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించగా, మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అశ్వారావుపేట పార్సిల్ కంపెనీ ఏజెంట్ మౌలాలీ ఫిర్యాదు మేరకు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇంటికెళ్లే ఆనందం.. అంతలోనే మృత్యువాత

### భార్య, నెలల బాబు ఎదుటే తండ్రి మృతి

కొణిజర్ల: తన భార్య, నెలల బాబును అత్తగారి ఇంటి నుంచి తీసుకుని సంతోషంగా ఇంటికి బయలుదేరిన ఓ వ్యక్తి జీవిత ప్రయాణం మధ్యలోనే ఆగిపోయింది. కుటుంబంతో సంతోషంగా గడపాలనుకున్న అతని జీవితం విషాదంగా ముగిసింది. ఈ హృదయ విదారక ఘటన తనికెళ్ల సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దగోపతికి చెందిన రేణుకతో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఇంద్రరెడ్డి కాలనీకి చెందిన నంబి ఫణిదర్‌కు(31) నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఫణిదర్ ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవల ప్రసవం కోసం పుట్టింటికి వచ్చిన రేణుక మగ బిడ్డకు జన్మనిచ్చింది. మూడు నెలలు పూర్తవడంతో వారిని తీసుకెళ్లేందుకు ఫణిదర్ మంగళవారం పెద్దగోపతికి వచ్చాడు. బుధవారం వారిని తీసుకుని ఆటోలో ఖమ్మం దాకా వెళ్లి అక్కడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు బయలుదేరాడు. ఆటోను డ్రైవర్ తనికెళ్ల సమీపంలో ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించే క్రమంలో బోల్తా పడింది. ఫణిదర్‌పై ఆటో పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భార్య, చిన్నబాబు ప్రాణాలతో బయటపడ్డారు. ఆటోలో మృతుని బంధువులు ఇద్దరు, మరొకరు ఉండగా వారంతా స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఓ వైపు బాబుకు ఏమైందోననే ఆందోళన, మరోవైపు భర్తను కాపాడాలని భార్య చేసిన ఆర్తనాదాలు అక్కడున్న వారిని కలచివేశాయి. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నారు.

# జర్నలిస్టులు పోరాడి హక్కులను సాధించుకోవాలి

## - టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య



వేములవాడ,ఏప్రిల్ 01 (వాయిస్ టుడే) : జర్నలిస్టులు తమ హక్కులను సాధించుకునేందుకు ఐక్యంగా పోరాటం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వ్యవ స్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. బుధవారం సిరిసిల్ల జిల్లా వేములవాడలోని మున్నూరుకాపు భవన్ లో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ వేములవాడ నియోజకవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా జర్నలిస్టులకు కనీసం అక్రెడిటేషన్లు, హెల్త్ కార్డులు ఇవ్వకపోవడం విచారకరమని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో విరోచిత పాత్ర పోషించిన జర్నలిస్టులను గత ప్రభుత్వం విస్మరించిందని, ఈ ప్రభుత్వం కూడా రెండేళ్లుగా సమస్యలు పరిష్కరించకుండా తీవ్ర వివక్ష చూపుతుందని అన్నారు. పాలకుల నిర్లక్ష్య వైఖరి పట్ల రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జర్నలిస్టులను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇండ్లు ఇండ్లస్థలాలు, హెల్త్ కార్డులు, పెన్షన్ వంటి డిమాండ్ల సాధనకై జర్నలిస్టులు పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని మామిడి సోమయ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర కో-కన్వీనర్ కుడితాడు బాపురావు మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కులు, సమస్యలపై పోరాడే ఏకైక సంఘం టీడబ్ల్యూజేఎఫ్ అని అన్నారు. జిల్లాలో ఫెడరేషన్ ను బలోపేతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పెరుక రవి అధ్యక్షత వహించగా, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, వేములవాడ కన్వీనర్ బిక్షపతి పాల్గొన్నారు.



### వేములవాడ కమిటీ ఎన్నిక

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) వేములవాడ నియోజకవర్గం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్ష పదవికి కొప్పుల ప్రసాద్, బొప్ప బిక్షపతి పోటీ పడగా జరిగిన రహస్య బ్యాలెట్ ఓటింగ్ లో అధ్యక్షునిగా బొప్ప బిక్షపతి (ప్రజా జ్యోతి) గెలుపొందారు. కార్యదర్శిగా గొల్లపల్లి వేణు (ఇంద్రప్రభ), ఉపాధ్యక్షులుగా కవ్వాల సురేందర్, కోశాధికారిగా సాహెద్ పాషా, జాయింట్ సెక్రెటరీలుగా ఏం సంజీవ్, చింతల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా నడిగట్ల మధు, చక్రహరి దేవేందర్ రాజ, నడికట్ల బిక్షపతి, బోడ్ల భరత్ బాబు, కొమురవెల్లి మునిష్ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండ దేవయ్య ఫెడరేషన్ రాష్ట్ర నాయకులను, ఎన్నికైన వేములవాడ కమిటీ నాయకులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.



# పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

### డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను
### ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

హనుమకొండ,వాయిస్ టుడే: డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించిన మౌలిక వసతుల పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ న్యూ శాయంపేటలోని నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించిన అన్ని బ్లాక్ లను కలెక్టర్ పరిశీలించారు. ఇళ్ల సముదాయంలో కల్పించిన మౌలిక వసతులను కలెక్టర్ తనిఖీ చేశారు. వసతులను గురించిన వివరాలను ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు,గృహ నిర్మాణ శాఖ పిడి సిద్ధార్థ నాయక్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ లకు సంబంధించిన 19 బ్లాక్ లలోని 608 గృహాలకు మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించాలని అధికారులను ఆదేశించారు. తాగునీరు,విద్యుత్తు,డ్రైనేజీ,తదితర సదుపాయాలను వెంటనే మొదలుపెట్టి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్లకు సంబంధించి పెండింగ్ లో ఉన్న ఇతర అభివృద్ధి పనులు కూడా పది రోజుల్లో పూర్తి చేయాలని అధికారుల ఆదేశించారు. గృహ సముదాయాలకు సంబంధించిన తాగునీటి వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరిశీలించి అందుకు సంబంధించిన మోటార్లను సత్వరమే బిగించాలని అధికారులకు సూచించారు. ప్రధాన రోడ్డు నుండి డబుల్ బెడ్ రూమ్ వరకు ఉన్న రోడ్డును వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. అదేవిధంగా గృహాలకు సంబంధించిన విద్యుత్ సరఫరా,ఫీడర్ ఛానల్ పనులు వేగవంతంగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్,గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి,మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



# అభివృద్ధిలో కాజీపేట రూపురేఖలు మారుస్తాం

### రాజకీయాలు,
### పార్టీలకు అతీతంగా అభివృద్ధి..

### సంక్షేమం,అభివృద్ధి రంగాల్లో ప్రత్యేక దృష్టి

### ప్రజలు తమపై ఉంచిన
### నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

### పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాజీపేట,వాయిస్ టుడే: నియోజకవర్గంలోని కాజీపేట ప్రాంతాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలపాలని సంకల్పంతో ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోందని వరంగల్ పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. గత పాలనలో కాజీపేట తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని..ఇప్పుడు ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి కొత్త దిశగా సాగుతోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. 99 రోజుల ప్రణాళిక ప్రగతి పాలనలో భాగంగా 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ రోడ్డులో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,నగర మేయర్ గుండు సుధారాణి ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో రాజకీయ ప్రయోజనాల కోసం శిలాఫలకాలు మాత్రమే ఏర్పాటు చేసి పనులు వదిలేసిన ఉదాహరణలు ఉన్నాయని విమర్శించారు. అయితే ప్రస్తుతం అలాంటి పరిస్థితులకు ముగింపు పలికి శంకుస్థాపన చేసిన పనులను వేగంగా పూర్తి చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. అభివృద్ధి పనులకు భారీగా నిధులు కేటాయిస్తూ కాజీపేట రూపురేఖలను పూర్తిగా మార్చే దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. కాజీపేటలో వైద్య రంగంలో కూడా నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టామని,ప్రజలు గత పాలనతో పోల్చి ప్రస్తుత ప్రభుత్వ పనితీరును అర్థం చేసుకోవాలని సూచించారు. కొంతమంది నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే కోచ్ ఫ్యాక్టరీ,రైల్వే డివిజన్,బస్ స్టాండ్ వంటి అంశాలపై ఆందోళనలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని విమర్శించారు. రాజకీయాలు,పార్టీలకు అతీతంగా అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని..ప్రజల మద్దతుతో కాజీపేటను ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో సంక్షేమం,అభివృద్ధి రంగాల్లో ప్రత్యేక దృష్టి సారించడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నియోజకవర్గానికి 3500 ఇళ్లను కేటాయించగా ప్రస్తుతం ప్రతి డివిజన్‌లో ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ విజయ శ్రీ రజాలీ,కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్,తోట వెంకన్న,స్థానిక తహసీల్దార్ రాజు,స్థానిక నాయకులు గుంటి కుమార్,సుంచు అశోక్,అంకుస్,పాలడుగు అంజనేయులు, పోగుల రాకేశ్,సంతోష్,సందీప్,భరత్, పార్టీ నాయకులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**